క్లుప్తంగా

జాజిరెడ్డిగూడెం సీపీఎం కార్యదర్శిగా శ్రీనివాస్



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల సీపీఎం కార్యదర్శిగా రామన్నగూడెం గ్రామానికి చెందిన వజ్జె శ్రీనివాస్ మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అర్వపల్లిలో సోమవారం ఎన్నికను నిర్వహించారు. గతంలో ఆయన రెండు సార్లు సీపీఎం మండల కార్యదర్శిగా పనిచేశారు. తిరిగి వరుసగా మూడోసారి మళ్లీ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు చేపడుతున్నట్లు తెలిపారు. తనను మూడోసారి కార్యదర్శిగా ఎన్నుకున్న జిల్లా, మండల కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు.

‘మైండ్ గేమ్ ఆడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం’

తుంగతుర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలతో మైండ్ గేమ్ ఆడుతోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత నెలకొన్నదని తెలిపారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, తునికి సాయిలు, ఉప్పుల నాగమల్లు, గోపగాని శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.

నాగారం పీఆర్ ఏఈఈలుగా కుమారస్వామి, మహేష్



కుమారస్వామి



మహేష్

నాగారం : నాగారం మండల పంచాయతీరాజ్ నూతన ఏఈఈలుగా కుమారస్వామి, మహేష్‌లు సోమవారం మండల కేంద్రంలోని పీఆర్ సబ్‌డివిజన్ కార్యాలయంలో పీఆర్ డీఈఈ బాబురావు ఆధ్వర్యంలో బాధ్యతలు చేపట్టారు. ఇటీవల నూతనంగా ఉద్యోగాలు సాధించిన కుమారస్వామి, మహేష్‌లు నాగారం మండల పంచాయతీరాజ్ ఏఈఈలుగా నియామకమయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ సిబ్బంది నూతన ఏఈఈలకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

హనుమాన్ చాలీసా పారాయణం



సూర్యక్షేత్రంలో పారాయణం చేస్తున్న కేఆర్ స్వామి భక్త బృందం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం సూర్యక్షేత్రంలో సోమవారం ఏకాదశి సందర్భంగా సూర్యాపేటకు చెందిన కేఆర్ స్వామి భక్తబృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా భజనలు వేశారు. అలాగే ఏకాదశి సందర్భంగా క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, ఇంద్రారెడ్డి, భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం



అయ్యప్ప స్వాములకు భోజనం వడ్డిస్తున్న మైనార్టీ నాయకుడు అబ్బాస్ అలీ

నూతనకల్ : మండల కేంద్రానికి చెందిన మైనార్టీ నాయకుడు, మాజీ మండల కో ఆప్షన్ మెంబర్ అబ్బాస్ అలీ కులమతాలకు అతీతంగా తన స్వగృహంలో సోమవారం అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు నాగం సుధాకర్‌రెడ్డి, కల్లెం కృష్ణారెడ్డి, బాణాల కిరణ్, దేవరకొండ సాయి, కొల్లు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

అర్వపల్లి : పశువులకు వ్యాధులు సంక్రమించకుండా రైతులు ముందస్తుగా టీకాలను వేయించుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్ కోరారు. మండలపరిధిలోని ఉయ్యాలవాడ గ్రామంలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నల్ల, తెల్ల పశువులకు టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో వీఎల్ఓ కేఎస్ఎస్ పద్మ, ఓఎస్ మధుసూదన్, గోపాలమిత్ర ఆల్దాస్ లింగయ్య, యాకయ్య, రైతులు పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

వేరుశనగ పంటకు తెగుళ్ల బెడద

- ఆందోళన చెందుతున్న రైతులు

తుంగతుర్తి : వాతావరణంలో తరుచుగా వస్తున్న మార్పుల కారణంగా వేరుశనగ పంటకు తెగుళ్లు సోకుతున్నాయి. ఈ ఏడాది మండలంలో రైతులు పెద్దమొత్తంలోనే వేరుశనగ పంటలను సాగు చేశారు. వేల రూపాయలు ఖర్చుచేసి విత్తనాలు కొనుగోలు చేసి వేరుశనగను పండిస్తున్నారు. కానీ కొన్ని ప్రాంతాల్లో వేరుశనగ పంటలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పంటలను కాపాడుకోవడానికి వేల రూపాయలు ఖర్చుచేసి మందులు వాడినా ఫలితం లేకుండాపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో కంటే అధికంగా..

గత సంవత్సరం తుంగతుర్తి మండలంలో రైతులు రబీ సీజన్‌లో వేరుశనగ పంటను 300 ఎకరాల్లో, కంది పంటను 600 ఎకరాల్లో సాగు చేశారు.



తుంగతుర్తిలో సాగులో ఉన్న వేరుశనగ చేను

అయితే ఇప్పుడు ప్రస్తుత రబీ సీజన్‌కు గానూ వేరుశనగ పంటను 400 ఎకరాల్లో, కంది పంటను 750 ఎకరాల్లో సాగుచేశారు. కానీ వాతావరణ మార్పుల కారణంగా పంటలను తెగుళ్ల ఆశిస్తున్నాయి. దీంతో ప్రతి 15 రోజులకు ఒకసారి మందులను పిచికారీ చేయాల్సి వస్తోంది. వేరుశనగ పంటలకు పచ్చపురుగు, గొంగళి పురుగు ఆశించి పంట పూర్తిగా దెబ్బతింటోంది. తెగుళ్ల నివారణకు అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుండడంతో చివరకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎప్పుడూ లేనంతగా తెగుళ్లు



వేరుశనగ పంటకు తెగుళ్లు ఆశించడంతో 15రోజులకు ఒకసారి మందులను పిచికారీ చేయాల్సి వస్తోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా వేరుశనగ పంటలకు తెగుళ్లు వస్తున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం ఉండడం లేదు.

– చింతకింది కిషన్, రైతు, వెలుగుపల్లి

బంధువులను టార్గెట్ చేయడం అన్యాయం



మాట్లాడుతున్న బడుగుల లింగయ్య యాదవ్

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్

సూర్యాపేట టౌన్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకనే ఆయన బంధువుల ఇళ్లు, ఫామ్‌హౌస్‌లపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దాడులు చేయించడం అన్యాయమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జన్వాడ ఫామ్ హౌస్, కేటీఆర్ ఇంట్లో పోలీసులు సోదాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. గృహ ప్రవేశ వేడుకను పోలీసులతో రాద్ధాంతం చేయించి అరాచకం సృష్టించిందన్నారు. ప్రతిపక్షంగా బలంగా ఉన్నామన్న అక్కసుతోనే కాంగ్రెస్ కక్ష పూరితంగా వ్యవహరిస్తోందన్నారు. ఇకనైనా కాంగ్రెస్.. చిల్లర రాజకీయాలు మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ జీడీ భిక్షం, సూర్యాపేట పట్టణ, ఆత్మకూరు (ఎస్) మండల పార్టీ అధ్యక్షులు సవరాల సత్యనారాయణ, తూడి నర్సింహారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, బండారు రాజా, మద్దెల వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

చివ్వెంల: అతివేగంగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనం బైకును ఢీ కొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామ శివారులో చివ్వెంల–ముకుందాపురం రహదారిపై సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్ (ఎస్) మండలం తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన దార యాకుబ్, పిడమర్తి కల్యాణ్ ఇద్దరు బైక్‌పై సూర్యాపేటకు వెళ్తుండగా వట్టిఖమ్మంపహాడ్ గ్రామశివారులో సూర్యాపేట నుంచి ఏపూర్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరికి కాళ్లు, చేతులు, ముఖానికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు.

పేదలకు భూమి పట్టాలు ఇప్పించాలి

భానుపురి : చివ్వెంల మండలం కుడకుడ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 126 ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేదలకు భూమి పట్టాలు ఇప్పించాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. సోమవారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని కలిసి ఆయనతో మాట్లాడారు. తమ పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆరేళ్లగా తమ పార్టీ ఆధ్వర్యంలో నిరుపేదలకు గుడిసెలు వేస్తుంటే గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, ఆయన అనుచరుడు గుర్రం సత్యనారాయణరెడ్డితో కలిసి అనేక తప్పుడు కేసులు పెట్టించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తుంటే, ఓర్వలేని కొంతమంది కిరాయి మనుషులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జ్ గోకినపల్లి వెంకటేశ్వర్‌రావు, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, డివిజన్ నాయకులు ఎస్‌కే సయ్యద్, పిడమర్తి లింగన్న, పీఓడబ్ల్యూ సహాయ కార్యదర్శి సూరం రేణుక, ఉపాధ్యక్షులు జయమ్మ, కోశాధికారి సంతోషి, బన్నీ పని తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే, నాయకులు

హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు

సూర్యాపేట : ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామం నుంచి దాదాపు 20మంది బీఆర్ఎస్ నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సంకినేని సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సంకినేని వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, పూర్తిస్థాయిలో అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని విమర్శించారు. సూర్యాపేట నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతంగా జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, జిల్లా ఉపాధ్యక్షుడు చల్లమల్ల నరసింహ, మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి మధు, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి కేసరి శోభారాణి, మండల నాయకులు మామిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు

తిరుమలగిరి మార్కెట్‌కు భారీగా ధాన్యం రాక

తిరుమలగిరి : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఈ సీజన్‌లోనే అత్యధికంగా సోమవారం 16,745 బస్తాల ధాన్యం వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. గరిష్ఠంగా క్వింటాల్‌కు రూ.2044, కనిష్ఠంగా క్వింటాల్‌కు రూ.1900 ధర పలికినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనా ఇప్పటివరకు కాంటాలు ప్రారంభం కాలేదు. దీంతో అనేకమంది రైతులు వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం అమ్ముకోవడానికి మొగ్గుచూపుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలి

అర్వపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నిర్వాహకులు కనీస వసతులు కల్పించాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు కోరారు. అర్వపల్లిలోని మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం మండలంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ట్యాబ్ ఆపరేటర్లకు ధాన్యం కొనుగోళ్లపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రాలలో నీడ, నీళ్లు, కరెంటు వసతులను కల్పించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా సీరియల్ ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని అన్నారు. బిల్లులు వెంటవెంటనే ట్యాబ్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వలిశెట్టి మల్లేష్, ఏఓ పి.గణేష్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బొడ్డు స్వప్న, ఏఈఓ నేరెళ్ల సత్యం, గిర్దావర్ పాటి వెంకట్‌రెడ్డి, సీసీలు నగేష్, పద్మావతి, అకౌంటెంట్ లింగంపల్లి ఈశ్వరి, కేంద్రాల నిర్వాహకులు, ట్యాబ్ ఆపరేటర్లు, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లిలో కేంద్రాల నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

నాగారం : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ వి.బ్రహ్మయ్య నిర్వాహకులకు సూచించారు. సోమవారం నాగారం, నాగారంబంగ్లా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలను ట్యాబ్‌లలో నమోదు చేయాలని సూచించారు. కాంటా అయినా ధాన్యాన్ని వెంట, వెంటనే లారీలలో మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు ఏపీఎం శోభారాణి, సీసీ రామయ్య, రైతులు ఉన్నారు.



నాగారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

పేద విద్యార్థులకు ఉచితంగా ఆటో సదుపాయం

మద్దిరాల : మండల పరిధిలోని చిన్ననెమిల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సేట్‌రాం తండా, శ్యాముల్ తండా, గుట్టకాడి తండాకు చెందిన విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి వాహనాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ దామెర సంతోష్‌కుమార్ విద్యార్థుల రాకపోకల కోసం ఉచితంగా ఆటోలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు దాత సంతోష్‌కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట కృష్ణారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మట్టపల్లి సారమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆటో

నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలి



ప్రచారం నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చివ్వెంల : ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి అల్గుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర యూనైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (టీస్ యూటీఎఫ్) జిల్లా కార్యదర్శి చిలుక రమేష్ కోరారు. సోమవారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని కుడకుడ, దురాజ్‌పల్లి, గుంజలూరు, జి.తిరుమలగిరి, తిమ్మాపురం, బి.చందుపట్ల, వట్టిఖమ్మంపహాడ్ గ్రామాల్లోని పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కనీసం మూడు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసిన వారు, నవంబర్ 1, 2024 వరకు ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు ఓటుకు అర్హులని తెలిపారు. అర్హులైన వారు నవంబర్ 6వ తేదీలోగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బి.దయాకర్, బండి పాపిరెడ్డి, యాదయ్య, సైదా పాల్గొన్నారు.

గిరిజన భవన్‌కు భూమి కేటాయించాలని వినతి



తుంగతుర్తిలో తహసీల్దార్ దయానంద్‌కు వినతి పత్రం అందజేస్తున్న గిరిజనులు

తుంగతుర్తి : గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తుంగతుర్తి మండల కేంద్రంలో గిరిజన భవన్ మంజూరైందని, ఆ భవన నిర్మాణానికి ప్రభుత్వం భూమిని కేటాయించాలని సోమవారం గిరిజన నాయకులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దయానంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో సంతు సేవాలాల్ భవనం నిర్మాణం కోసం టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని తెలిపారు. కానీ ప్రభుత్వం మారడంతో భవన నిర్మాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి పది నెలల అయినప్పటికీ గిరిజన భవన్‌కు ప్రభుత్వ స్థల సేకరణ జరగలేదని అన్నారు. ఇప్పటికైనా వెంటనే స్థల సేకరణ చేపట్టి, భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు యాకునాయక్, మాన్‌సింగ్, భిక్షం నాయక్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గోవులను తరలిస్తున్న వాహనం పట్టివేత



పట్టుబడిన గోవులు

తుంగతుర్తి: అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని సోమవారం తుంగతుర్తి మండల కేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన ప్రకారం.. నకిరేకల్–తానంచర్ల 365వ నంబర్ హైవేపై అన్నారం ఎక్స్‌రోడ్డు వద్ద సోమవారం తెల్లవారుజామున పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన డీసీఎంను తనిఖీ చేశారు. అందులో 30 కోడె దూడలు, 16 ఆవు దూడలు ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డీసీఎం డ్రైవర్‌ను విచారించగా.. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాకు చెందిన వడిత కుమార్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్ సంతలో పశువులను కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని తుక్కుగూడ సంతకు తరలిస్తున్నట్లు పేర్కొన్నాడు. కుమార్‌తోపాటు డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసి పట్టుబడిన మూగజీవాలను గోశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

అర్వపల్లి : ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షురాలు పర్వతం సంధ్యారాణి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తపస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆ సంఘం ఆధ్వర్యంలో గిర్దావర్ పాటి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పెండింగ్ బిల్లులు, పెండింగ్ డీఏలు చెల్లించాలని, పీఆర్‌సీ అమలును వెంటనే చేపట్టాలని కోరారు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండగా కేవలం ఒక్క డీఏను మాత్రమే ఇవ్వడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ నాగారం మండల అధ్యక్షుడు జుట్టుకొండ నవీన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షురాలు సంధ్యారాణి

ఆత్మకూరు మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీస్

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండల కేంద్రం మీదుగా సూర్యాపేట డిపో నుంచి మహబూబాబాద్ వరకు (ప్రస్తుతం బంగ్లా వరకు) ఆర్టీసీ బస్సులను అధికారులు నడిపిస్తున్నారు. ఏళ్ల తరబడి మండల కేంద్రానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా ప్రజలు, నాయకుల వినతి మేరకు కొన్ని రోజుల క్రితం వరకు బస్సు సర్వీస్‌ను నడిపించారు. కానీ మళ్లీ బస్సులను బంద్ చేశారు. అయితే బస్సులు రాక.. ప్రయాణం సాగక అనే శీర్షికన ఈ నెల 12వ తేదీన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆర్టీసీ అధికారులు గత మూడు, నాలుగు రోజుల నుంచి మండల కేంద్రం మీదుగా బంగ్లా వరకు ఆర్టీసీ బస్సును నడిపిస్తున్నారు. కానీ రోజు రెండు ట్రిప్పులు మాత్రమే నడిపిస్తున్నారని, మరో రెండు ట్రిప్పులు పెంచితే సౌకర్యవంతంగా ఉంటుందని ప్రయాణికులు కోరుతున్నారు.



ఆత్మకూరు నుంచి వెళ్తున్న ఆర్టీసీ బస్సు

మృతుడికి నివాళి

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మున్నా పోశాలు(56) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడి మృతదేహాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్నా కొమ్ములయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



నూతనకల్ : విద్యార్థులకు టై, బెల్టులు అందిస్తున్న హెచ్ఎం రామ్మోహన్, మాజీ సర్పంచ్ బాబు

నూతనకల్ : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం దాతలు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. రామ్మోహన్, మాజీ సర్పంచ్ కొచ్చెర్ల బాబు అన్నారు. సూర్యాపేట పట్టణానికి చెందిన సుధా పిల్లల హాస్పిటల్ డాక్టర్ గాజుల చంద్రశేఖర్ ఆర్థిక సహకారంతో సోమవారం మండల పరిధిలోని యడవెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు టై, బెల్టులతో పాటు రెండు గ్రీన్ బోర్డులను బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాల అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందించిన దాతకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ వేర్పుల రామతార, ఉపాధ్యాయులు ఎస్‌కే సైదులు, జలగం యాకస్వామి, భయ్యా దేవేందర్, జలగం అబ్రహాం, కళమ్మ, ఉమ తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి : తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని నల్లగొండ డైట్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ కొణతం శ్రీనివాసరెడ్డి కోరారు. తన స్వగ్రామమైన తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో తన తండ్రి సత్యనారాయణరెడ్డి 47వ వర్ధంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ డైమండ్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అలాగే పాఠశాలకు క్రీడాసామగ్రి అందజేశారు. తాను కూడా ఈ పాఠశాల పూర్వ విద్యార్థినేనని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం కుంభం ప్రభాకర్, ఉపాధ్యాయులు కె.నర్సయ్య, వి.కృష్ణయ్య, కె.వెంకన్న, కె.రవీందర్, మాధవి, రెహానాబేగం, కె.శీనయ్య, శ్రీనివాస్, పీడీ దాసయ్య, మహబూబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

చివరి విడతగా గోదావరి జలాల పునరుద్ధరణ

అర్వపల్లి: వానాకాలం సీజన్‌కుగాను చివరి విడతగా జిల్లాకు గోదావరి జలాలను పునరుద్ధరించారు. జిల్లాలో 69, 70, 71 మూడు డిస్ట్రిబ్యూటరీలు ఉండగా ప్రస్తుతం 71 డీబీఎం కాలువకు మాత్రమే 600 క్యూసెక్కుల నీటిని పునరుద్ధరించారు. ఈ డిస్ట్రిబ్యూటరి కింద తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ మూడు నియోజకవర్గాల పరిధిలో సుమారు 1.20లక్షల ఎకరాలకు పైగానే ఆయకట్టు ఉంది. దీంతో చివరి భూములకు నీరు చేరడానికై చివరి విడతగా నీటిని వదిలారు. అయితే ముందుగా వేసిన వరి పంటల కోతలు ప్రారంభమయ్యాయి. ఆలస్యంగా సాగుచేసిన పంటలు మరో వారం రోజుల్లో కోతకు రానున్నాయి. పంటలు చేతికొచ్చే సమయం దగ్గర పడడంతో గోదావరి జలాలను త్వరలోనే నిలిపివేస్తామని నీటిపారుదల శాఖ డీఈ ఎం.సత్యనారాయణ సోమవారం తెలిపారు.



డీబీఎం కాలువకు వస్తున్న నీళ్లు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఆత్మకూర్(ఎస్) : మండలంలోనిబొప్పారం గ్రామ సమీపంలోని వాగు నుంచి సోమవారం ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, ట్రాక్టర్ యజమాని బోడ శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ శంకర్‌నాయక్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణం బాలాజీనగర్‌లోని కేఆర్ఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన 1981–84 బీకాం బ్యాచ్ విద్యార్థులు సోమవారం హైదరాబాద్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 40 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాడు విద్యా బోధన చేసిన గురువును ఘనంగా సన్మానించారు.

పిచ్చిమొక్కల తొలగింపు

అర్వపల్లి : అర్వపల్లిలోని పల్లె ప్రకృతి వనం కంపచెట్లు, పిచ్చిమొక్కలతో నిండి అధ్వానంగా మారింది. దీంతో ఈ ప్రకృతివనంలోకి వెళ్లడానికి కూడా ఇబ్బందిగా మారింది. సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి మాగి నాగయ్య జీపీ కార్మికులతో పిచ్చిమొక్కలు తొలగించే పనులు చేయించారు.



కంపచెట్లను తొలగిస్తున్న సిబ్బంది